సమస్యలకు మోక్షం

- 20వ వార్డులో సమస్యలపై 'సాక్షి' కథనాలు
- స్పందించి.. పరిష్కరించిన జీవీఎంసీ అధికారులు
- హర్షం వ్యక్తం చేసిన స్థానికులు

సాక్షి ఎఫెక్ట్..

జీవీఎంసీ 20వ వార్డులో పలు సమస్యలు తిష్ట వేశాయి. వాటి వల్ల కొద్ది రోజులుగా స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారులు దెబ్బతినడం, వీధుల్లో, రహదారుల్లో విద్యుత్ లైట్లు వెలగకపోవడం, రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురి కావడం వంటి సమస్యలు ఈ వార్డును వేధిస్తున్నాయి. వీటిపై 'సాక్షి'లో ప్రచురించిన కథనాలపై జీవీఎంసీ అధికారులు స్పందించారు. చర్యలు చేపట్టి పలు సమస్యలను పరిష్కరించి మోక్షం కలిగించారు. దీంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. – బీచ్‌రోడ్డు

ఫుట్‌పాత్‌లపై దుకాణాల తొలగింపు



నాడు: పెదవాల్తేరు రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన శాశ్వత దుకాణాలు

చినవాల్తేరు నుంచి పెదవాల్తేరుకు వెళ్లే రహదారిలోని ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కొంత మంది శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. వీటి వల్ల స్థానికులు, వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులపై 'ఆక్రమణలకు అడ్డేది..?' అనే శీర్షికన ప్రచురించిన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. అక్కడి ఫుట్‌పాత్‌లపై ఒక్క షాపు కూడా లేకుండా మొత్తం తొలగించి వాహనాలకు, పాదచారులకు ఇబ్బంది లేకుండా సమస్యను పరిష్కరించారు.



నేడు: దుకాణాలు తొలగించడంతో ఖాళీగా ఫుట్‌పాత్

గోతుల రహదారికి మరమ్మతులు

పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ దేవాలయం నుంచి వీఎంఆర్‌డీఏ పార్క్‌కు వెళ్లే మార్గంలో ఏడాది కిందట నిర్మించిన రహదారిలో భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డులో రాకపోకలకు వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులపై గత నెల 22న 'గోతులమయం' అనే శీర్షికన ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు. రహదారిలోని గోతులను పూడ్చి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు చేపట్టారు.



నాడు: పెదవాల్తేరు - వీఎంఆర్‌డీఏ పార్కు రోడ్డులో ఏర్పడిన గొయ్యి



నేడు: గోతుల పూడ్చిన అనంతరం రహదారి

ఆకర్షణీయ రహదారిలో విద్యుత్ కాంతులు



నాడు: పోలమాంబ దేవాలయం - వీఎంఆర్‌డీఏ పార్క్ రోడ్డులో వెలగని లైట్లు



నేడు: ఆలయం వద్ద రహదారిలో విద్యుద్దీప కాంతులు

ఎంతో చక్కగా తీర్చిదిద్దిన పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ దేవాలయం నుంచి వీఎంఆర్‌డీఏ పార్క్ వైపు వెళ్లే మార్గంలో విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో అంధకారంలోనే వాహన చోదకులు ప్రయాణాలు సాగించే వారు. ఈ సమస్యపై గత నెల 28న 'దారులన్నీ చీకటిమయం' అనే శీర్షికన ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. ఈ రోడ్డులోని విద్యుత్ దీపాలను సరిచేసి వెలిగించారు. దీంతో ఈ మార్గం విద్యుత్ కాంతులతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది.

మునసబ్ వారి వీధిలో విద్యుత్ వెలుగులు



నాడు: అంధకారంలో మునసబ్ వారి వీధి



నేడు: వీధిలో వెలుగుతున్న విద్యుత్ లైటు

వార్డులోని మునిసబ్ వారి వీధిలో మూడు రోజులుగా విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. ఈ సమస్యపై 'అంధకారంలో మునసబ్ వారి వీధి' అనే శీర్షికన గత నెల గత నెల 31 ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టారు. జీవీఎంసీ సిబ్బంది వీధిలోని విద్యుత్ స్తంభాల లైట్లను మార్చి వెలుగులు రప్పించారు. దీంతో స్థానికులు రాత్రి వేళల్లో పాములు, పురుగుల నుంచి రక్షణ పొందారు.

క్లుప్తంగా

మువ్వల సురేష్‌కు పరామర్శ



మువ్వల సురేష్ ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకుంటున్న నాగార్జున యాదవ్

బీచ్‌రోడ్డు: అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్‌ను సోమవారం ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ పరామర్శించారు. సురేష్ నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్యం గురించి ఆరా తీసి వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షుడు పిల ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నా భర్తకు పింఛన్ ఇచ్చి ఆదుకోండి



వినతిపత్రం చూపుతున్న పెద్దిరెడ్డి భూలక్ష్మి

మహారాణిపేట: 'నా భర్త ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పదేళ్ల క్రితం మాకు వివాహం జరిగింది. ఇద్దరు ఆడపిల్లలు. ఒకరోజు పని నిమిత్తం బయటకు వెళ్లి వచ్చాక ఆయన రెండు కాళ్లు చచ్చుబడ్డాయి. ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వైద్యులు పెరాలసిస్ వచ్చిందని చెప్పారు. అప్పటి నుంచి నా భర్త కదల్లేని స్థితిలో మంచానికే పరిమితమయ్యాడు. కుటుంబాన్ని పోషించడం భారంగా మారింది. నా భర్తకు పింఛన్ మంజూరు చేయాలని గతంలోనే దరఖాస్తు చేసుకున్నా.. ఇప్పటివరకు ఇవ్వలేదు. పీజీఆర్‌ఎస్‌లో కూడా రెండు సార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. అద్దె ఇంట్లో పేదరికంతో ఉన్న మా కుటుంబాన్ని ఆదుకోవాలి. పింఛనుతోపాటు ఇల్లు కూడా మంజూరు చేయాలి' అని ఆరిలోవకు చెందిన పెద్దిరెడ్డి భూలక్ష్మి అనే గృహిణి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను వేడుకుని, వినతిపత్రం అందజేసింది.

వార్డుల్లో విస్తృతంగా యోగా శిక్షణ



20వ వార్డులో యోగా శిక్షణ పొందుతున్న సచివాలయం, ఇతర ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా తూర్పు నియోజకవర్గంలోని పలు వార్డుల్లో యోగా శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఎంవీపీ కాలనీ, శివాజీపాలెం, చినవాల్తేర్ ప్రాంతాలతోపాటు అనేక చోట్ల శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నగర ప్రజలను ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వాములు చేసే దిశగా జీవీఎంసీ, జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా వార్డుల వారీగా తూర్పులో అనేక చోట్ల కొన్ని రోజులుగా యోగాపై శిక్షణ ఇస్తున్నారు. ఆర్‌పీలు, ఆశ వర్కర్లు, సచివాలయ ఉద్యోగులు, స్వయం ఉపాధి సంఘాల మహిళలు పాల్గొంటున్నారు. పలువురు ట్రైనర్ల ద్వారా యోగాసనాలపై శిక్షణ అందించి అంతర్జాతీయ యోగా దినోత్సవంలో రికార్డు నెలకొల్పే దిశగా ప్రోత్సహిస్తున్నారు.

డ్రైనేజీపై ఆక్రమణల తొలగింపు

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీలో ఆక్రమణలకు గురైన డ్రైనేజీపై షాపులు, ఇతర నిర్మాణాలను సోమవారం జీవీఎంసీ జోన్-3 టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. దశాబ్దాలుగా లాసన్స్ బే కాలనీకి చెందిన డ్రైనేజీపై పెద్ద ఎత్తున షాపులు నిర్మించారు. ఫుట్‌పాత్ వరకు ఈ అక్రమ నిర్మాణాలు సాగాయి. టీ, టిఫిన్స్, ఫాస్ట్‌ఫుడ్, కార్ గ్యారేజ్, కోకోనట్ జ్యూస్ ఇలా అనేక షాపులను డ్రైనేజీపై ఏర్పాటు చేశారు. డ్రైనేజీ పూర్తిస్థాయిలో మూతపడటంపై ఇటీవల ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీవీఎంసీ యంత్రాంగం స్పందించింది. ఆక్రమణకు గురైన డ్రైనేజీని వెలికితీసి పునర్నిర్మాణ చర్యలు చేపట్టింది.

కొన్ని షాపులపైనే చర్యలు..

డ్రైనేజీపై చాలా చోట్ల ఆక్రమణలు పూర్తిస్థాయిలో తొలగించక పోవడంతో టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై వ్యాపారులు విమర్శలు గుప్పిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆక్రమణలకు పాల్పడిన అన్ని షాపులపైన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు.. కొన్ని షాపులనే పొక్లెయిన్లతో తొలగించడాన్ని తప్పుపడుతున్నారు. అందరికీ సమన్యాయం చేసి ఆక్రమణకు పాల్పడిన ప్రతి షాపుపైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

4న వెల్లువలా తరలిరండి



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న నాగార్జున యాదవ్, మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: సీఎం చంద్రబాబు దగాకోరు పాలనను నిలదీయడానికి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని ఆ పార్టీ రాష్ట్ర వలంటీర్ విభాగం అధ్యక్షుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అన్నారు. సీతమ్మధారలోని పార్టీ తూర్పు కార్యాలయానికి సోమవారం వచ్చిన ఆయనకు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు స్వాగతం పలికారు. అనంతరం అప్పారావు అధ్యక్షతన పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాగార్జున యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన తెలుపుతూ చేయబోయే వెన్నుపోటు దినం కార్యక్రమానికి నియోజకవర్గంలోని 15 వార్డుల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కూటమి ప్రభుత్వం వెన్నుపోటుకు గురైన సంక్షేమ పథకాల లబ్ధిదారులు, వలంటీర్లందరూ ఈ కార్యక్రమానికి హాజరయ్యేలా నాయకులు కృషి చేయాలని సూచించారు. తూర్పు నుంచి సుమారు 5,000 మందికి పైగా ప్రజలు తరలివచ్చి నిరసనను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, పార్టీ జిల్లా నాయకులు పల్లా దుర్గారావు, పేర్ల విజయ్ చందర్, ఉమ్మిడి దాసు, పీలా ప్రేమ్, అల్లంపల్లి రాజబాబు, బోని శివరామకృష్ణ, దేవరకొండ మార్కండేయులు, కొండారెడ్డి, సుబ్రహ్మణ్యం, సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, ఉమ్మిడి కల్యాణ్, ప్రదీప్, వేణుగోపాలరెడ్డి, మహిళా నాయకులు పోలరత్నం, సంధ్య, జగదీశ్వరి, పార్వతి, శిరీష, జోషిలా, త్రినాథ్, చందు, సాయి పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేద్దాం



15వ వార్డులో వెన్నుపోటు దినం పోస్టర్లు ప్రదర్శిస్తున్న నడింపల్లి కృష్ణంరాజు

మద్దిలపాలెం: అమలు కాని హామీలతో ప్రజలను వంచించిన ముఖ్యమంత్రి చంద్రాబాబు దగాకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఈ నెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, వార్డు మాజీ కార్పొరేటర్ నడింపల్లి కృష్ణంరాజు పిలుపునిచ్చారు. 15వ వార్డు సింహాద్రిపురంలో సోమవారం కార్యక్రమ పోస్టర్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం సమర్పించే కార్యక్రమంలో వార్డు నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కణితి మరియదాసు, అనకాపల్లి రమణమ్మ, పెద్దిరెడ్డి నూకరాజు, మారేడుబూడి జోజి, వెంకటరావు, మారేడుబూడి వెలంగని, రామకృష్ణ, భాస్కర్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

చినగదిలి మండలంలోని పాఠశాలలకు పుస్తకాల సరఫరా



స్కూల్ బ్యాగ్, పుస్తకాల షోకేస్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ



తోటగరువు జెడ్పీ హైస్కూల్‌లో సిద్ధం చేసిన పాఠ్య పుస్తకాలు

ఆరిలోవ: సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర 2025-26 విద్యా సంవత్సర పాఠ్య పుస్తకాలను తోటగరువు జెడ్పీ హైస్కూల్ నుంచి సరఫరా చేస్తున్నారు. చినగదిలి మండలంలోని వివిధ పాఠశాలలకు పుస్తకాలను వ్యాన్‌లు, ఆటోల్లో తరలించే కార్యక్రమాన్ని సోమవారం ఎంఈవో-1 సిహెచ్.రవీంద్రబాబు, ఎంఈవో-2 పి.అనురాధ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల కిట్లకు సంబంధించిన షోకేస్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ చినగదిలి మండలంలో 58 పాఠశాలలున్నట్లు తెలిపారు. వాటిలో 11 జిల్లా పరిషత్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ ఉన్నత పాఠశాలలు కాగా, ఒక ప్రాథమికోన్నత, 46 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయన్నారు. వాటిల్లో ఈ విద్యా సంవత్సరంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 12,475 మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. వారికి మొదటి సెమిస్టర్‌కు సంబంధించిన 65,879 పాఠ్య పుస్తకాలతోపాటు బ్యాగులు, షూలు తదితర కిట్లు మండలానికి చేరినట్లు తెలిపారు. ఈ కిట్లను తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మండలంలోని అన్ని పాఠశాలలకు తరలిస్తున్నామని చెప్పారు. రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాలు సెప్టెంబర్‌లో వచ్చే అవకాశముందన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, పీటీఐలు పాల్గొన్నారు.

శ్యాంసుందర్‌కు సన్మానం



రిటైర్డ్ ఈఈ శ్యాంసుందర్‌ను సన్మానిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, ఉద్యోగులు

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన ఎ.శ్యాంసుందర్‌ను మెట్రోపాలిటన్ కమిషనర్ కె.విశ్వనాథన్, సహచర ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సోమవారం శ్యాంసుందర్ దంపతులకు శాలువా కప్పి జ్ఞాపిక ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ శ్యాంసుందర్ 40 ఏళ్ల సుదీర్ఘ సేవలో వివిధ హోదాల్లో నిబద్ధత కలిగిన అధికారిగా అంకిత భావంతో విధులు నిర్వర్తించారని ప్రశంసించారు. ఆయన అనుభవం, సలహాలు, సూచనలు తీసుకొని జూనియర్ ఇంజినీర్లు ముందుకు సాగాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం శ్యాంసుందర్ శేషజీవితం ఆనందంగా, ఆరోగ్యంగా సాగాలని అభిలాషించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ఎస్ఈలు భవానీ శంకర్, బలరామరాజు, ఎస్టేట్ ఆఫీసర్ దయానిధి, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, డీఎఫ్‌వో సుజాతా శివానీ, ఈఈలు రామరాజు, మధుసూదన్‌రావు, దుర్గాప్రసాద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన చెట్టు తొలగింపు



రామ్‌నగర్ రోడ్డులో కూలిన చెట్టును తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

బీచ్‌రోడ్డు: గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు 28వ వార్డు రామ్‌నగర్‌లో కూలిన చెట్టును సోమవారం జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. రోడ్డు మీద చెట్టు పడిపోవడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి.. సిబ్బందిని పంపి చెట్టును తొలగింపజేశారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలని ధర్నా



రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: గతేడాది ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక గాలికొదిలేశారని, వెంటనే వాటిని నెరవేర్చాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రూరల్ తహసీల్దార్ కార్యాలయం ముందు పేదలతో కలసి ధర్నా చేపట్టారు. హామీలు అమలు చేయాలని, పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు కేటాయించి, నిర్మాణం ఖర్చులు రూ.4 లక్షలు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ పాల్‌కిరణ్‌కు వినతిపత్రాలు అందజేశారు. పేదలతో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేయించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిల్లి పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహ్మాన్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపైనే ఉందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణాల్లో ఒక సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో ఒకటిన్నర సెంట్ల ఇంటి స్థలాలను పేదలకు కేటాయించిందన్నారు. దాన్ని రెండు, మూడు సెంట్లుకు పెంచి ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలన్నింటినీ, సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు బేగం, దేవుడమ్మ, లక్ష్మణరావు, కాసుబాబు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కోసం తిప్పలు



రేషన్ బియ్యం మూటతో ఇబ్బంది పడుతున్న మహిళ



ఆరిలోవలో 545 డిపో వద్ద క్యూలో వృద్ధులు



ఆరిలోవలో 358 రేషన్ డిపో వద్ద వృద్ధుల నిరీక్షణ

ఆరిలోవ: రేషన్ డిపోల వద్ద సరకుల కోసం పేదలను తిప్పలు పడుతున్నారు. ఇంతవరకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేసే వాహనాలను రద్దు చేసి ఆదివారం నుంచి పాత పద్ధతిలోనే కూటమి ప్రభుత్వం రేషన్ డిపోల వద్ద సరకులు పంపిణీ ప్రారంభించిన విషయం తెలిసిందే. దీంతో డిపోల వద్దకు రేషన్ సరకుల కోసం వెళ్లిన వారు క్యూలు కడుతున్నారు. గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. మొదటి రోజు మాదిరిగా సోమవారం కూడా సర్వర్లు మొరాయించాయి. ఆరిలోవ ప్రాంతంలో పలు డిపోల వద్దే ఇదే పరిస్థితి నెలకొంది. వృద్ధులు సైతం క్యూలో నిరీక్షించక తప్పలేదు. సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో గంటల తరబడి నిరీక్షించలేని వృద్ధులు అక్కడే నేలపైనే కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంకొందరు దూర ప్రాంతాల నుంచి చిన్న పిల్లలను సైతం తీసుకొని డిపోల వద్దకు వెళ్లాల్సి వచ్చింది. అక్కడ తీసుకున్న బియ్యం, సరకుల మూటలను మోసుకుంటూ ఇళ్లకు చేరడానికి నానా ఇబ్బందులు పడ్డారు.

సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ చేస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది

ఆరిలోవ: ఏపీఈపీడీసీఎల్ మధురవాడ డివిజన్ పరిధిలో అధికారులు పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం జాతీయ రహదారిపై హనుమంతవాక కూడలి నుంచి విశాలాక్షినగర్ మీదుగా జోడుగుళ్లపాలెం బీచ్ రోడ్డు వరకు సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. వీటి వల్ల ఉపయోగాలు, వీటికి కేంద్ర ప్రభుత్వం అందించే సహాయం గురించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ విభాగం అధికారులు మాట్లాడుతూ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు కోసం ప్రభుత్వం రాయితీ సౌకర్యం కల్పించిందన్నారు. మూడు కిలోవాట్లకు రూ.78 వేలు రాయితీ ఇస్తారన్నారు. బీసీలకు మరో రూ.20 వేలు అదనంగా రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ర్యాలీలో మధురవాడ డివిజన్ సూపరింటెండెంట్ శ్యాంబాబు, జోన్-3 ఈఈ(ఆపరేషన్) పోలాకి శ్రీనివాసరావు, మధురవాడ, భీమిలి, ఆనందపురం, గోపాలపట్నం, పెందుర్తి డీఈఈలు టి.కిరణ్‌కుమార్, రమేష్, రాజశేఖర్, రాముునాయుడు, సిహెచ్.కోటేశ్వరరావు, అన్ని సెక్షన్ల జేఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.